

# కల

భోరున వర్షం కురుస్తుంది.

ఉదయం నుండీ ప్రశాంతంగా ఉన్నవాతావరణం మాధ్యాహ్నమయ్యే సరికి హఠాత్తుగా మారింది. ప్రకృతి ధర్మాన్ని తెలియజేస్తున్నట్టు.

పెంటయ్య కూడా తెచ్చుకున్న తెల్ల డ్రెస్ వేసుకొని హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమౌతున్నాడు.

''కలెట్టర్‌లాగున్నడు నాబిడ్డ'' అడ్రెస్సులో కొడుకును తనవితీర చూసుకుంటున్న చంద్రమ్మ హృదయానందం-కళ్లను తన్నుకొని వచ్చింది.

''ఈడు డాగుటరే అయితడు'' తండ్రి రామయ్య ఆశ హిమవన్నగం పై స్థిరంగా కూచున్నది.

''నీయవ్వ! ఇల్లు మంచిగ గప్పలేదేందే! అప్పుడే గుడిసెలోపల సందులో నుండి టపీ మంటూ పడిన మసిబారిన నీటి చుక్క. పెంటయ్య ఎడమ భుజం మీద మరక చేసి తన విధ్యుక్త ధర్మం నెరవేర్చుకోవడం ఆ వర్ధమాన జీవికి చిరాకు తెప్పించింది.

'' ఏం జేతం బిడ్డా. శేతుల పైసలు లేవు. సేను కలుపుకొచ్చింది. నీకేమొ ఇప్పుడే తొందరొచ్చె.... '' రామయ్య ఆవేదన.

''నీయవ్వ! నాసదువనే సరికి నీకు కడుపు మండుతది, నాకీ సదువొద్దు యేమొద్దు ఇగవూకో.'' తండ్రి ఆవేదన తనకు ప్రతిబంధకంగా భావించిన తనయుని ఆక్రోశం, గబగబా గుడ్డలిప్పేందుకుపక్రమించాడు పెంటయ్య.

చెంద్రమ్మ మనసు విలవిల్లాడిపోయింది. '' అరె! నీవు వాని మన్సుకు పైను లేకుండ జేస్తవేంది. కాలేజి సదువులంటె ఎన్నుంటయ్? వానికి మన కష్టం దెలవదా? వాడు పట్నంల ఎంత కష్టపడుతున్నాడో నీవు జూడవొయినవా?'' అంటూ పెనిమిటిని తిట్టింది.

''నీవూకో బిడ్డ. అయిన సంగతి నీకు దెలువదా! అయ్నెప్పుడన్న నిన్ను తాత్పరంగా వోనిచ్చిండా? నీవు తయారుగా'' ఆప్యాయత నిండిన మనసుతో కొడుకును ముట్టుకోబోయి తన చేతుల మాలిన్యం తెల్ల బట్టల కంటుకుంటుందేమోనని మిన్న కుండిపోయింది.

ఒక్క క్షణం తన తల్లితండ్రి తనకోసం పడ్తున్న కష్టం గుర్తుకొచ్చింది పెంటయ్యకు.

కాని 1 సం॥నుండి ఇంటర్ చదువు పుణ్యంతో తాను హైదరాబాద్‌లో పొందుతున్న సుఖం మరుక్షణం ఆ బాధను కనబడనంత దూరంగా విసిరేసింది.

షర్టుపై బడ్డ మరకను కుండలో నీళ్లతో శుభ్రం చేసుకుంటున్నాడు.

''ఇంత వానల పోకపోతేంది బిడ్డా. పొద్దుగాల పోదువుగాని'' బిడ్డ ఎక్కడ ఇబ్బంది పడ్తాడోనన్న బాధ ప్రత్యక్షర ప్రత్యక్షం– తండ్రి మాటల్లో.

'' ఇయ్యాల వోకపోతే రేపు టైముకు కాలేజికెట్ల వోవాలె. ఇప్పుడు దప్పితె మల్ల రేపు 10 గంటలదాకా బసులేదు. ఒక్కరోజు కాలేజికి వోకపోతే ఎంతనష్టమో నీకేందెలుస్తదే!'' పెంటేశ్ కసురుకున్నాడు. నిజానికి ఇంకా కాలేజిలో పాఠాలు మొదలవలేదు. కాని, రేపు విడుదలయ్యే తమ అభిమాన హీరో సినిమా చూడ్డానికి ఫ్రెండ్స్‌తో కలిసి వేసుకున్న ప్లాన్ ఎక్కడ ఫెయిలవుతుందోనన్నదే బాధ.

''నీవు జెర్ర సేపు ఊకుండవు గదనే! వాని పాణం దింటవు. గవన్ని వానికి జెప్పాల్నా?'' బయటికోసారి తొంగిచూసి మళ్లీ అంది చెంద్రమ్మ.

''చినుకులు గూడ తక్వయినయి. నీవు చెత్తిరి (గొడుగు) పటుకోని వాన్ని బస్‌కాడి దాంక పంపిచ్చిరా!'' భర్తకు చెప్పింది.

''ఆ! గదిగూడ నువునాకు జెప్పాలెనాయేం. గాయింత దెల్వదా నాకు.'' వెంటనే అన్నాడు రామయ్య.

'' ఏమొద్దుతియ్. నేంబోత.'' పెంటేశ్ తండ్రికి ఇబ్బంది కల్గకూడదనే ధ్వని పలికించాడు.

కాని, చిరిగిన గుడ్డల్తో, అతుకుల గొడుగు పట్టుకొని, ప్రక్క ఊరిదాకా తండ్రి రావడం, అది చూసిన వాళ్లు తనను చులకనాగా చేస్తే తట్టుకునే గుండె ధైర్యం లేదతనికి.

చివరికి తల్లిదండ్రుల బలవంతాన్ని అధిగమించలేకపోయాడు.

★ ★ ★

కొడుకుకు గొడుగిచ్చి, తను ప్లాస్టిక్ పేపర్ తలపై వేసుకొని బయలుదేరాడు-రామయ్య.

రేగడినేల కావడం వల్ల అక్కడక్కడ కాళ్లు జారుతున్నయ్.

''పైలంబిడ్డా గట్టిగట్టి జాగ జూసి కాలుపెట్టు'' హెచ్చరిస్తూనే ఉన్నడు రామయ్య కొడుకును.

''సరేలే!'' అంటూ మార్గం తెలిసింది, చిన్నప్పట్నుండీ అనుభవమైందీ కాబట్టి జాగ్రత్తగా నడుస్తున్నాడు పెంటయ్య.

పెంటయ్య నేలమీద నడుస్తున్నాడు కాని, మనసంతా హైదరాబాద్‌లోని సుదర్శన్ టాకీస్ చుట్టూ తిరుగాడుతున్నది.

★ ★ ★

'అరె! పెంటేశ్! ఏమిట్రా ఇంతాలస్యం చేశావు? నువ్వసలు రావేమో అనుకున్నాం తెల్సా? '' సుదర్శన్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

ఒక వారం అన్నమైనా మానేస్తాం, మూడ్రోజులు నీళ్ళైనా మానేస్తాం. ఒకరోజు పరీక్షైనా మిస్సవుతాం,కాని మన అభిమాన హీరో సినిమా రిలీజింగ్‌షో చూడకుండా ఉంటామా బాస్!'' కళ్ళెగరేస్తూ, తన హీరోను అనుకరించాడు పెంటేశ్.

''అబ్బ! నీ యాక్షన్ డిట్టో మన హీరోలాగే ఉంటుందిరా! సినిమాల్లో చేరిపోరాదురా!'' పెంటేశ్ బలహీనతలు బ్రహ్మచారికి బాగాతెల్సు.

ఆనపకాయలాంటి పెంటేశ్ అక్షణంలో గుమ్మడికాయైపోయాడు.'' చూస్తావుండు బాస్! మనం హీరోలమై, సినిమారంగాన్ని ఓ ఆటాడించేస్తాం!'' కరాటే పోజిచ్చాడు.

''అరె! అప్పుడే ఒకట్టైన్నర, జల్ది బోవాలె లేకుంటే టికెట్స్ దొరకై'' వేగిర పరిచాడు రంగారావు.

''పదండి పోదాం!''

'మరి కాలేజీ...! అదే సంవత్సరం జూనియర్ ఇంటర్‌లో చేరి, అప్పుడప్పుడే వీళ్ల స్నేహ పరిమళాల్ని ఆఘ్రాణిస్తున్న సుబ్బారావు

అమాయకంగా అడిగాడు.

అందరూ విరగబడి నవ్వేశారు.

మాట్లాడుతూ సినిమా థియేయటర్ చేరుకున్నారు నలుగురూ. అప్పటికే ఐదు రూపాయల టికెట్ దగ్గర క్యూ రెండు వందలకుపైగా ఉంది. మరికొద్ది సేపట్లో బుకింగ్ ప్రారంభమౌతుంది.

అప్పుడు టిక్కెట్ ఎలా సంపాదించాలో మిత్రులకు తెలుసు.

ముందుగా సుదర్శన్ రెడ్డి ఇద్దరి మధ్య కాస్త ఖాళీగా ఉన్న స్థలంలో దూరాడు మెల్లగా. ముందుగానే అవి మెత్తని మొహాలని తెలుసు రెడ్డికి.

'అరె! ఏ క్యా హై భై! ఫీఛేసే ఆవోనా!' అన్నాడు వెనుకున్న అర్భకుడు.

''హమ్ ఇస్‌సే పహలే ఠైర్‌కే గయే జీ! ఆప్ హీ పైలే టికెట్ లో.'' పొలైట్‌గా వెనుకున్నఅర్భకుడ్ని శాంత పరిచాడు.

మరో ఐదు నిముషాలు గడిచాయి.

పెంటేశ్ స్టైల్‌గా సుదర్శన్ రెడ్డి ముందర వెళ్లి నిల్చున్నాడు. అంతకు ముందే రెడ్డి ఏర్పాటు చేసిన ఖాళీలో.

అంతే,

వెంటనున్న వాళ్లంతా ఒక్కసారి అరిచారు.

''మారో...మాకె...కో''

''తన్నండి యెదవను.''

ఇంతలో వెనుకనుండి ఎవడో '' పోలీస్! పోలీస్!'' అంటూ అరిచాడు.

ఒకరిద్దరు పెంటేశ్‌ను బయటికి లాగేందుకు ప్రయత్నించారు.

అప్పటిదాకా తమాషా చూస్తూన్నట్లు నిలబడ్డ కానిస్టేబుల్ నేలమీద బాదుతూ ఉర్దూలో బూతులు మాట్లాడుతూ అక్కడికి చేరుకున్నాడు.

హీరోలాగే స్టైల్‌గా అందర్ని దూరంగా తోసేస్తూన్న పెంటేశ్ దగ్గరికి వస్తున్న గార్డును చూశాడు.

తన అభిమాన హీరో పోలీసుల్తో ఎలా ఫైట్ చేస్తాడో గుర్తొచ్చింది.

''యూ్హ్హా! ''

అంటూ గాలిలోకి ఎగిరాడు. అంతే...

తాను నడుస్తూ చెఱువు గట్టు దాకా వచ్చానని, ఆ కాలిబాటలో ఏ మాత్రం పక్కకు కదిలినా చెరువులో పడిపోక తప్పదనే విషయం కాలు జారే దాకా తెలియలేదు పెంటయ్యకు.

''అర్‌రెర్రె..రె! పడ్తవు బిడ్డా!'' తండ్రి మాట పూర్తి కాకుండానే

పెంటయ్య కాలు జారడమూ, రెండు కాళ్ళూ అదుపుతప్పి జ(రున జారుతూ చెరువు నీళ్లలో పడిపోవడమూ, నీళ్లలోని బురదలో మోకాళ్ల వరకూ దిగబడి పోవడమూ, గొడుగు వెళ్ళి అల్లంత దూరాన నీటి ప్రక్క పొదలో ఇరుక్కు పోవడమూ ఆలోచించేంత వ్యవధైనా లేకుండా జరిగిపోయాయి.

''అయ్యయ్యో బిడ్డా! ఎంతపనైపోయె బిడ్డా! నేం జెప్తనే ఉంటి సూసి నడువు మని'' అంటూ నెమ్మదిగా గట్టుదిగి చేయి అందించాడు.

బిడ్డ బాధ చూడలేని రామయ్య కళ్లలో చెరిగిపోయిన కలదాచుకోలేని పెంటేశ్ కళ్లలో సుళ్లు తిరిగాయి నీళ్ళు.

ఇవేవీ పట్టనట్లు అక్కడికి వంద గజాల దూరం నుండి హార్న్ సౌండు వినిపిస్తూ వెళ్ళిపోయింది బస్సు.

*( ఆంధ్రప్రభ 22–5–92 వారపత్రిక – అచ్చులో మొదటి కథ)*